
పాన్‌గల్‌: బుసిరెడ్డిపల్లిలో..


వనపర్తి: కడుకుంట్లలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


మదనాపురంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


ఆత్మకూర్‌లో మట్టి వినాయకుడిని పూజిస్తున్న భక్తులు

## లంబోదరుడికి ఘనంగా పూజలు

జిల్లాలో గణేశ్‌ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం జిల్లా కేంద్రంతో పాటు మండలకేంద్రాలు, గ్రామాల్లో లంబోదరుడికి ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మదనాపురంలోని పలు మండపాల నుంచి గణనాథులను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువకులు, చిన్నారులు నృత్యాలతో హోరెత్తించారు.

\- సాక్షి నెట్‌వర్క్‌

# వేలిముద్ర అంతరాయానికి చెక్‌..!

- ఇక నుంచి పెన్షన్‌కు ముఖ గుర్తింపు
- వృద్ధులకు తొలగనున్న బాధలు
- ప్రత్యేక యాప్‌ సేవలు అందుబాటులోకి




మదనాపురం: పింఛన్‌ కావాలంటే.. వేలిముద్రలు వేయాలంటారు. కానీ చేతి వేళ్లు సహకరించడం లేదు. ఇప్పుడు ఎలా.. ఇదే వృద్ధుల గుండెల్లోని మాట. కానీ ఇక ఆ ఇబ్బంది లేదు గతం మారబోతోంది. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ముఖ గుర్తింపు విధానం వృద్ధుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపబోతోంది. వయస్సు రీత్యా వేలి ముద్రలు సరిగా అందక ఇబ్బందులు పడుతున్న వారికి ఇది వరం కాబోతుంది.

మళ్లీ మళ్లీ వేళ్లు తిప్పుతూ బయోమెట్రిక్‌ వేదికల చుట్టూ తిరిగే రోజులుపోయాయి. ఇకనుంచి మొబైల్‌ ఫోన్‌ కెమెరా ఎదుట ముఖం చూపితే చాలు, పింఛన్‌ డబ్బులు వృద్ధుల చేతిలోకి చేరుకుంటాయి.

**పెన్షన్‌ పొందేందుకు ఇక ముఖమే గుర్తింపు**

ఈ యాప్‌ వ్యవస్థ గత నెలలో అమల్లోకి వచ్చింది. 'వృద్ధుల ప్రయోజనాల కోసం, మృతుల పేర్లపై నకిలీగా పెన్షన్‌ తీసుకునే అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ద్వారా లబ్ధిదారుల ముఖాన్ని స్కాన్‌ చేసి, వారి వివరాలను ధృవీకరించి పింఛన్‌ అందజేస్తున్నారు. తద్వారా వృద్ధుల సౌకర్యం పెరిగిందని అధికారులు వెల్లడిస్తున్నారు. పేద వృద్ధులకు పెన్షన్‌ అంటే భరోసా.. ఇప్పుడు ఆ భరోసా మరింత సులభంగా, సురక్షితంగా అందనున్నందుకు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖగుర్తింపు యాప్‌ తో పెన్షన్లు ఇవ్వడంతో వృద్ధులు, వేలిముద్రలు రాని వారికి ఎంతో ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు చెందిన వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు చేయూతనివ్వాలని ఉద్దేశంతో చేయూత పథకం వలన ప్రతినెలా లబ్ధిదారులకు పెన్షన్‌ డబ్బులను ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు బిల్‌ కలెక్టర్‌లు, బ్రాంచ్‌పోస్ట్‌ మాస్టర్‌ ద్వారా నూతనంగా ప్రభుత్వం రూపొందించిన ముఖగుర్తింపు ప్రత్యేక యాప్‌ ద్వారా పెన్షన్‌ అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పింఛన్‌ విభాగం సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి పంపిణీ పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే అప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

**జిల్లాలో పింఛన్ల వివరాలు :**

వృద్ధాప్య పింఛన్లు 27,998 దివ్యాంగులు 11,009 వితంతువులు 28,215 చేనేత కార్మికులు 580, కల్లు గీతాకార్మికులు 399 ఒంటరి మహిళలు 2,534 బీడీ కార్మికులు 968 ఉన్నారు.

**అక్రమాలకు చెక్‌**

పింఛన్ల పంపిణీలో అక్కడక్కడ అక్రమాలు జరుగుతున్నాయని ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో ప్రత్యేకంగా ఈ యాప్‌ రూపొం దించారు. కొన్నిచోట్ల నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులవి ఇబ్బందులు ఉండేవి. చనిపోయిన వారిని గుర్తించడంతో పాటు ఇతరత్ర వాటిలో తావివ్వకుండా ప్రభుత్వం ముఖంతో గుర్తించే విధంగా రూపొందించింది. దీనివలన అన్నిరకాల ఇబ్బందులు తొలగిపోయాయి.

–ప్రసన్నకుమారి, ఎంపీడీవో, మదనాపురం

# రుణాలు పునరుద్ధరించాలని ధర్నా


బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఏఐయూకేఎస్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

అమరచింత: రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను బ్యాంకు అధికారులు వడ్డీ తీసుకుని రెన్యూవల్‌ చేస్తూ రైతులను ఆదుకోవాలంటూ ఏఐయూకేఎస్‌ ఆధ్వర్యంలో యూనియన్‌ బ్యాంకు ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ.. మండలకేంద్రంలోని యూనియన్‌ బ్యాంక్‌ ద్వారా వ్యవసాయ రుణాలను పొందిన రైతులను సకాలంలో పూర్తిగా చెల్లించాలంటూ బ్యాంకు అధికారులు ఒత్తిడి పెడుతున్నారన్నారు. దీంతో రైతు బ్యాంకు అప్పులను తీర్చడానికి బయటి వ్యక్తుల ద్వారా అప్పుచేసి రుణాలను చెల్లించే పరిస్థితి దాపురించిందన్నారు. ఇదే అదనుగా భావించిన బ్యాంకు వద్ద ఉన్న దళారులు రూ.లక్ష రెండు నుంచి రూ.3వేల వరకు వడ్డీ తీసుకుని అప్పులు ఇస్తూ లబ్ధి పొందుతున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీసుకున్న రుణంకు ఏడాదికి ఎంత వడ్డీ అవుతుందో అంతే మొత్తంను రైతుల నుంచి తీసుకుని రుణాలను రెన్యూవల్‌ చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. అధికారులు స్పందించి వడ్డీ తీసుకుని రుణాలను రెన్యూవల్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ వినతిపత్రాన్ని బ్యాంకు మెనేజర్‌ రామకృష్ణకు అందించారు. మేనేజర్‌ మాట్లాడుతూ పై అధికారులకు విన్నవించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాసారెడ్డి, జి.రవి, మహేంద్రచారి, చింతలన్న, సంజీవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నల్లారెడ్డి, రాజు, సుధాకర్‌, జనార్దన్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, మల్లారెడ్డి, సీపీఐ మాస్‌లైన్‌ పార్టీ జిల్లా నాయకులు ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత సృష్టిస్తే చర్యలు


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ దామోదర్‌ నాయకులు

ఆత్మకూర్‌: ఎరువుల దుకాణాల్లో యూరియా కొరతను సృష్టిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని, డీలర్ల లైసెన్సులను రద్దు చేస్తామని ఏడీఏ దామోదర్‌ అన్నారు. శనివారం మండలంలోని జూరాల గ్రామంలోని రైతువేదికలో అమరచింత, ఆత్మకూర్‌ మండలాల ఎరువుల దుకాణాల డీలర్ల సమావేశంలో మాట్లాడారు. ఎరువుల దుకాణాల్లో యూరియా స్టాక్‌ బోర్డులను ఏర్పాటు చేయాలని, ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించరాదన్నారు. యూరియాను దాచిపెట్టడం, బ్లాక్‌ చేయడం జరిగితే లైసెన్సులు రద్దు చేస్తామని, యూరియా సరఫరాను పూర్తిస్థాయిలో పారదర్శ రంగా ఈపీఓఎస్‌ యంత్రం ద్వారానే అమ్మకాలు జరపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఓలు వినయ్‌కుమార్‌, అరవింద్‌, ఆయామండలాల డీలర్లు ఉన్నారు.

**ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి**

అమరచింత: యూరియా కోసం వచ్చిన రైతు చెంపపై కొట్టి గాయపరిచిన ఎస్‌ఐపై వెంటనే చర్య తీసుకోవాలని సీపీఐ మాస్‌లైన్‌పార్టీ, ఏఐయూకేఎస్‌ పార్టీ నాయకులు డిమాండ్‌ చేశారు. శనివారం మండలంలోని మార్క్‌భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నారాయణపేట జిల్లా మరికల్‌ మండలం తీలేర్‌లో యూరియా కోసం తెల్లవారు జామున 4గంటల నుంచి వేచి ఉన్న రైతులకు సకాలంలో యూరియా ఇవ్వలేని అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కావాలని టోకేన్‌లు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తున్న రైతులపై మరికల్‌ ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తించి చెంపపై కొట్టడం తగదన్నారు. వెంటనే ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో రాజు, రాజన్న, వెంకటయ్య, చింతలన్న, మాస్లామని, కురుమన్న, జిలాని పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలి




వనపర్తి రూరల్‌: పెబ్బేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.పవన్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెబ్బేరు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి 11ఏళ్లు గడుస్తున్న సొంత భవనం లేకపోవడం బాధకరమన్నారు. సరిపడా వసతులు లేకపోవడంతో విద్యార్థులు జాయిన్‌ కావడం లేదన్నారు. వీటిని ఆసరా చేసుకొని ప్రైవేట్‌ కార్పొరేట్‌ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్‌, గణేష్‌, నాగరాజు, లాలప్పతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

### యూనియన్‌ బ్యాంక్‌ ఏర్పాటు చేయాలి



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్ల గ్రామంలో యూనియన్‌ బ్యాంక్‌ ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్‌ వరలక్ష్మీతో గ్రామపంచాయతీ తీర్మానాన్ని తీసుకున్నట్లు నాగర్‌కర్నూల్‌ జిల్లా పర్యాటకశాఖ అధికారి నర్సింహ తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం కల్వరాల్ల గ్రామ ప్రత్యేకాధికారిగా తహసీల్దార్‌ ఉండడంతో శనివారం తహసీల్దార్‌ తీర్మానపత్రాన్ని బ్యాంకు అధికారులకు పంపించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్‌ సోషల్‌ మీడియా కోఆర్డినేటర్‌ భరత్‌చారి పాల్గొన్నారు.

### వైద్యసిబ్బంది బాధ్యతగా పనిచేయాలి



వీపనగండ్ల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సీజనల్‌ వ్యాధులు ప్రబలే పరిస్థితి ఉందని వాటిని నివారించేందుకు వైద్యసిబ్బంది గ్రామాల్లో పని చేయాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. శనివారం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆశవర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయుష్‌ డాక్టర్‌ హేమవర్ధన్‌, కరుణశ్రీ, భాగ్యశ్రీ, కవిత, మౌనిక, వైద్యాధికారులు కళమ్మ, విజయకుమారి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యం.. కేసు నమోదు


రాములమ్మ

పాన్‌గల్‌: వివాహిత అదృశ్యమైన సంఘటనపై శనివా రం కేసు నమోదైంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లాపూర్‌ మండ లం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన రాములమ్మకు గోప్లాపూర్‌ గ్రామానికి చెందిన వీరపాగస్వామితో 40 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు ఉన్నది. గత కొన్ని రోజుల నుంచి రాములమ్మ వారి పుట్టింటికి వెళ్లి వస్తుండేది. అదేక్రమంలో 10రోజుల కింద ఇంటి నుంచి వెళ్లిన వివాహి త తిరిగి ఇంటికి రాలేదు. ఆమె ఆరోగ్యం కూడా సక్రమంగా లేదు. పది రోజుల నుంచి బంధువులు, చుట్టుపక్కల వారి ఇళ్లలో వెతికి నా ఆచూకి లభించలేదు. మహిళ 5.2 అడుగుల ఎత్తు, చామనచాయ రంగు ఉందన్నారు. శనివారం భర్త వీరపాగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### రోడ్డు విస్తరణను 50 అడుగులు చేయాలి



పాన్‌గల్‌: మండలంలోని రేమద్దులలో కొల్లాపూర్‌ వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డును 50 అడుగులు విస్తరించాలని కోరుతూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి నందకిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు గంధం ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని 50 అడుగుల వెడల్పుతో విస్తరించాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా డిమాండ్‌ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, తిరుపతయ్య, సురేందర్‌రెడ్డి, నందకుమార్‌, నరవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### సీజనల్‌ వ్యాధులతో జాగ్రత్త

వనపర్తిటౌన్‌: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్‌ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్‌ కమిషనర్‌ ఎస్‌.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ఉమా మహేశ్వర్‌రెడ్డి, వార్డు ఆఫీసర్స్‌, మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొనారు.

### పరిశుభ్రత అందరి బాధ్యత



ఆత్మకూర్‌: పట్టణ ప్రజలు సీజనల్‌ వ్యాధుల బారిన పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్‌ కమిషనర్‌ శశిధర్‌ అన్నారు. శనివారం స్థానిక పురపాలిక పరిధిలోని వార్డుల్లో అధికారులు, కార్మికులతో కలసి 100 రోజుల కార్యాచరణలో భాగంగా ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడుకేటర్‌ సురేందర్‌గౌడ్‌, వార్డుల అధికారులు కాషన్న, ముబ్బషీర్‌, అశోక్‌, మోహన్‌సాగర్‌, యూన్సీరెడ్డి, అనూష, మోహన్‌, దయానంద్‌, శివన్న, మధుబాబు, ఆశన్న, మక్బూల్‌, అరుణ్‌కుమార్‌, షోయబ్‌, నరేందర్‌ తదితరులు ఉన్నారు.

### అంగన్‌వాడీల్లో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ

ఆత్మకూర్‌: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రతినిత్యం ఆట వస్తువులు, పాటలతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ శ్రీలత అన్నారు. శనివారం మండలంలోని మూలమల్ల గ్రామంలోని అంగన్‌వాడీలో ఎర్లీచైల్డ్‌ కేర్‌ ఎడ్యుకేషన్‌డే సందర్భంగా 3 నుంచి ఆరేళ్లలోపు పిల్లలను చేరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, లక్ష్మీదేవి, ఆయాలు, చిన్నారుల తల్లులు తదితరులు ఉన్నారు.

# వరినాట్లతో మహిళల వినూత్న నిరసన


బురదలో వరినాట్లు వేస్తున్న ఐద్వా నాయకురాలు, కాలనీ మహిళలు

వనపర్తిటౌన్‌: వర్షాలు పడితే ఇంట్లో నుంచి అడుగు పెట్టలేకపోతున్నామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు సాయిలీల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో వర్షాల కారణంగా బురదమయమైన దారిలో కాలనీ మహిళలు వరి నాట్లు వేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షం పడితే కాలనీ మొత్తం బురదమయంగా మారుతుందన్నారు. అధికారులు స్పందించి కాలనీలో సీసీ రోడ్డు వేయాలని డిమాండ్‌ చేశారు. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి మురుగుపారక దుర్వాసన కాలనీ మొత్తం నిండుకుందని, డ్రైనేజీ శుభ్రంగా లేకపోవడంతో ఈగలు, దోమల వ్యాప్తి చెంది సీజనల్‌ వ్యాధులు వస్తున్నాయని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఉమా, కాలనీ మహిళలు లలిత, సుశీల, రమీజాబేగం, పార్వతి, కమల, అరుణ, వెంకటమ్మ, శారద, లావణ్య పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, కాంగ్రెస్‌ నాయకులు

అమరచింత: ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసి మొదటివిడతగా రూ.లక్ష మంజూరు చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తూ పాంరెడ్డిపల్లె గ్రామానికి చెందిన లబ్ధిదారు దేవల్ల శారదమ్మ సీఎం రేవంత్‌ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్‌ మాట్లాడుతూ.. బేస్‌మెంట్‌ లెవల్‌ పూర్తిచేసిన మహిళకు రూ.లక్ష మంజూరి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ గ్రామాధ్యక్షుడు బండి బీసీరెడ్డి, మాదారంకృష్ణ, మహేష్‌, మాజీసర్పంచ్‌ బండిపావని వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, హనుమంతు నాయక్‌,రాకేష్‌ గౌడ్‌ పాల్గోన్నారు.

# ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపాలి


వనపర్తిలో ఎంపీడీఓ రవీంద్రబాబు

అమరచింత: మండలంలోని ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే రాజకీయ నాయకులు తెలుపాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జాబితాపై అభ్యంతరాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, నరేష్‌రెడ్డి, రమేష్‌ ముదిరాజ్‌, మహేందర్‌రెడ్డి, అబ్రహం, భాస్కర్‌, వినోద్‌ పాల్గొన్నారు.

వీపనగండ్ల: ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నేతలు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీనివాసారావు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ముసాయిదా ఓటర్‌ జాబితాపై రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆవుల నారాయణ, సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, ఈశ్వర్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సీపీఐ మండలకార్యదర్శి గోపాల్‌ పాల్గొన్నారు.

పాన్‌గల్‌: ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నేతలు తెల్పిన అభ్యంతరాలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ గోవిండ్‌రావు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ నేతలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వహీద్‌, సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్‌ పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ఓటరు జాబితాలో చాలావరకు తప్పులు చోటుచేసుకున్నాయని వాటిని సవరించాలని బీఆర్‌ఎస్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. శనివారం అఖిలపక్ష సమావేశంలో ఏదుల మండల జాబితాలో చాలావరకు తప్పులు చోటుచేసుకున్నాయని వెంటనే వాటిని సవరించాలని బీఆర్‌ఎస్‌ నాయకులు కోరారు. ఈ మేరకు ఇంచార్జి ఎంపీడీఓ రఘురాములుకు బీఆర్‌ఎస్‌ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో చెన్నారం మాజీసర్పంచ్‌ రమేష్‌, బీఆర్‌ఎస్‌ జిల్లా మైనారిటీ నాయకుడు మహ్మద్‌అబ్దుల్లా, అద్దకుర్మయ్య, వీరపాగ అశోక్‌, వెంకటస్వామి, నితీష్‌, వెంకటయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిరూరల్‌: జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై పలు రాజకీయ నాయకులతో ఎంపీడీఓ రవీంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు జాబితాపై అభ్యంతరాలు సూచించారు.

ఆత్మకూర్‌: ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలుపాలని ఎంపీడీఓ శ్రీపాద్‌, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్‌, నల్గొండశ్రీను, అశోక్‌, లక్ష్మీనారాయణ శెట్టి, తిరుపతయ్యగౌడ్‌ తదితరులు ఉన్నారు.

### కంప్యూటర్‌ విద్యతో మెరుగైన ఫలితాలు



ఖిల్లాఘనపురం: కంప్యూటర్‌ విద్యతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశాలు ఉన్నాయని ఎంఈఓ జయశంకర్‌ అన్నారు. శనివారం మండలంలోని మామిడిమాడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఏఎక్స్‌ఎల్‌ ప్రోగ్రాం (కృత్రిమ బోధన) కంప్యూటర్‌ విద్యను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని తెలుగు, ఇంగ్లిష్‌ మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాలలను ఆయన పరిశీలించారు.కార్యక్రమంలో క్లస్టర్‌ హెచ్‌ఎం చెన్నప్ప, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రంగయ్య, ఉపాధ్యాయులు గీతాంజలి, విజయ్‌, చంద్రశేఖర్‌ కేజీబీవీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

### ఆస్పత్రిలోకి వర్షపునీరు



ఆత్మకూర్‌: ఆత్మకూర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో వర్షపునీరు చేరడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి ఆస్పత్రి జలయమంగా మారిందని, పై సీలింగ్‌నుంచి నీరు కారుతోంది. వర్షాలు మొదలైనప్పటినుంచి ఇదే పరిస్థితి ఉందని, కొద్దికాలం క్రితమే రూ.5లక్షలతో సీలింగ్‌ మరమ్మతులు చేసిన పరిస్థితి ఇలాగే ఉందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆస్పత్రిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

### మొక్కలను సంరక్షించాలి

మదనాపురం: మండలకేంద్రంలో జెడ్పీ పాఠశాలలో శనివారం విద్యార్థులు మొక్కలునాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసన్నకుమారి పాల్గొని మొక్కలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది అశోక్‌గౌడ్‌, హెచ్‌ఎం మద్దిలేటి, వడ్డెకృష్ణ, రామకృష్ణ, వెంకటస్వామి, ఉపాధ్యాయబృందం, పాల్గొన్నారు.

### యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు



ఖిల్లాఘనపురం: యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని మండల సింగిల్‌విండో చైర్మన్‌ కె.మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం దగ్గర మాజీ సింగిల్‌విండో చైర్మన్‌ వెంకటేశ్వర్‌రావు, మండల వైస్‌ చైర్మన్‌ క్యామరాజు, జిల్లా మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ శ్యాంసుందర్‌రెడ్డిలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా దొరుకుతుందో లేదో అని ఆందోళనతో ఎరువల దుకాణాల ప్రతిరోజూ ముందుగానే చుట్టూ తిరగడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఎంపీ మల్లురవి, విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో యూరియా తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆగారం ప్రకాష్‌, రవినాయక్‌ పాల్గొన్నారు.

**పెబ్బేరులో..**

వనపర్తి రూరల్‌: పెబ్బేరు సింగిల్‌విండో కార్యాలయం దగ్గర శనివారం రైతులు క్యూలైన్‌లో నిలబడ్డారు. వారికి వ్యవసాయ అధికారులు ఎకరాకు బస్తా లెక్కన టోకన్లు అందజేశారు. పెబ్బేరులో 450, తిప్పాయిపల్లి సెంటర్‌ వద్ద 300 సంచుల యూరియా రైతులకు పంపిణీ చేశామని ఏఓ షేక్‌ మున్నా తెలిపారు.

- శ్రీరంగాపూర్‌ మండలం వెంకటాపురం గ్రామంలోని సింగిల్‌విండో వద్ద 300 బస్తాల యూరియాను శనివారం రైతులకు పంపిణీ చేశామని, ఇక్కడ ఎలాంటి కొరత లేదని ఏఓ హైమావతి వివరించారు.

### స్కానింగ్‌సెంటర్‌ స్టాఫ్‌పై చర్యలు తీసుకోవాలి

వనపర్తిటౌన్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కో-ఎడ్‌ కళాశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ మాతశిశు సంరక్షణ వైద్యశాలలోని స్టాఫ్‌ నర్సులు గర్భిణుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏఐవైఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్‌ ఆరోపించారు. ఈ మేరకు శనివారం హాస్పిటల్‌లో గర్భిణులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులకు గంటల తరబడి వేచిఉంచి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్కానింగ్‌ స్టాఫ్‌నర్సులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్‌, అశోక్‌, రవి తదితరులు పాల్గొన్నారు.